ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

మానకొండూర్ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

మానకొండూర్, నవంబర్ 20: ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం మానకొండూర్, వెల్ది పీహెచ్‌సీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు వైద్యసిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని అదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. పీహెచ్‌సీలలో జరుగుతున్న ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఐవో సాజిదా, వైద్యులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ బియాబాని, సీహెచ్‌వో రాజూనాయక్, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, జుబేర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 20 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఈ నెల 23 నుంచి డిసెంబర్ 9 వరకు మరో అవకాశం కల్పించారని, దీన్ని అర్హులం దరూ సద్వినియోగం చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలో పలువురు పట్టభద్రులను ఆయన కలిసి, రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉండి, వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి నాలుగు జిల్లాల వ్యాప్తంగా నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు. పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

శుక్ర, శనివారాల్లో నీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్, నవంబర్ 20: నగరంలోని లో లెవెల్ జోన్‌లో గల భగత్ నగర్ రిజర్వాయర్ పరిధిలో శుక్ర, శనివారాల్లో మంచినీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ ఈఈ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. భగత్ నగర్ రిజర్వాయర్ వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు జరుగుతున్నందున ఈ రిజర్వాయర్ పరిధిలోని 13, 33, 34, 35, 51, 52,53, 54వ డివిజన్లలో నీటి సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటాం

జమ్మికుంట, నవంబర్ 20: మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని, కూల్చివేసేందుకు వెనుకాడబోమని కమిషనర్ ఎండీ ఆయాజ్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు ఏరియాలో మున్సిపల్‌కు సంబంధించిన స్థలం కబ్జాకు గురికాగా, ఆక్రమణను తొలగించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని, వాటిని కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. స్థలాలను కాపాడుకునేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని, కాలనీల్లో ఉన్న స్థలాలకు ప్రహరీ ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. ఆయన వెంట టీపీవో శ్రీధర్, టీపీఎస్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, నవంబర్ 20: మానేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెడ్డిపల్లి శివారులో పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. కోర్కళ్ గ్రామానికి చెందిన సదరు ట్రాక్టర్ యజమాని ఎలుకపెల్లి రాజయ్య, డ్రైవర్ ఎలుకపెల్లి సాయి గణేశ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ బియ్యానికి భారీ డిమాండ్

చిగురుమామిడిలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయి కమిషనర్

- రాష్ట్ర వ్యాప్తంగా 7707 కొనుగోలు కేంద్రాల్లో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

కలెక్టరేట్/ చిగురుమామిడి/ చొప్పదండి/ కరీంనగర్ రూరల్, నవంబర్ 20: తెలంగాణ బియ్యానికి ఇతర ప్రాంతాల్లో అత్యధిక డిమాండ్ ఉందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. వానకాలం ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు, ఇతర అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో వివిధ శాఖల అధికారులు, మిల్లర్లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో పండిస్తున్న తెలంగాణ సోనా, ఆర్ఎన్ఆర్, సన్న రకాల బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. సీఎంఆర్ కేటాయింపులో ఎలాంటి వివక్షకు తావు లేకుండా పారదర్శకత పాటిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 18 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 7707 కొనుగోలు కేంద్రాల్లో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. తూకం వేసిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నట్లు వివరించారు. అధికారులు నిత్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, సమస్యలుంటే సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు నిబంధనలు పాటిస్తే ఎలాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండదని, దొడ్డు రకం, సన్న రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుంచి సేకరించే ధాన్యంలో ఎలాంటి కోతలు విధించకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. జిల్లాలో 340 కేంద్రాల నుంచి 1.23లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. అనంతరం చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం విక్రయించిన రైతులకు రెండు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తున్నట్లు, అలాగే సన్నాలకు బోనస్ కూడా అందిస్తున్నట్లు చెప్పారు. పచ్చిగా ఉండే వరిపంటను కోయకూడదని, ధాన్యాన్ని పలుచగా ఆరబెట్టాలన్నారు. చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పౌరసరఫరాల కమిషనర్.. రైతులు వరి పంటను పూర్తిగా ఆరబెట్టిన తర్వాతనే కోస్తున్నారని అభినందించారు. అలాగే కరీంనగర్ మండలం నగునూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కల్లాల వద్ద హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టరు లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా సహకార అధికారి రామానుజాచారి, జిల్లా వ్యవసాయాధికారి మహేశ్, పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగరావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్, మార్కెటింగ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

గంగాధర పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

చొప్పదండి/ గంగాధర, నవంబర్ 20: వేములవాడలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. చొప్పదండిలో అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, మాజీ సర్పంచులు వెల్మ నాగిరెడ్డి, గన్ను శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అజ్జు, నాయకులు మాచర్ల వినయ్, గుడిపాటి చిన్నారెడ్డి, యువరాజ్, పెద్దేల్లి అనిల్, నితీశ్, నరేశ్, కుమార్ ఉన్నారు. అలాగే గంగాధర మండలంలో మాజీ సర్పంచులు మేచినేని నవీన్‌రావు, సాగి మహిపాల్‌రావు, మడ్లపెల్లి గంగాధర్, అలువాల తిరుపతి, జోగు లక్ష్మీరాజం, శ్రీమల్ల మేఘరాజు, వడ్లూరి ఆదిమల్లు, నాయకుడు సుంకె అనిల్ తదితరులను అరెస్ట్ చేశారు.

తాడికల్ వద్ద విస్తృత తనిఖీలు

శంకరపట్నం, నవంబర్ 20: హుజూరాబాద్‌కు చెందిన దళితబంధు సాధన సమితి సభ్యులు వేములవాడలో సీఎం సభకు వెళ్లి ఆటంకం కలిగిస్తారనే ఉద్దేశంతో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో తాడికల్‌లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు ఆపి తనిఖీలు చేశారు. ఇక్కడ హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, కేశవపట్నం, సైదాపూర్ ఎస్ఐలు రవి, తిరుపతి, స్పెషల్ యాక్షన్ టీం, స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

అయ్యప్పస్వాములకు ఘన సన్మానం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 20 : కరీంనగర్ నుంచి శబరిమలకు గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్రలో పాల్గొన్న గురుస్వాములు, స్వాములకు తమిళనాడు రాష్ట్రంలోని సేలం అయ్యప్ప దేవాలయంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్ నుంచి వెళ్లిన కలికోట ముఖేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో 18 సంవత్సరాలు మాల ధారణ చేసుకున్న గురు స్వాములకు, పాదయాత్రలో పాల్గొన్న స్వాములందరినీ ఘనంగా సన్మానించారు. ఇక్కడ సంతోష్, డి. సంపత్, రాకేశ్, రమేశ్, మధుసూదన్ రెడ్డి, రవికుమార్, జగన్, నరేశ్, కోటేశ్వరరావు, 140 మంది స్వాములు ఉన్నారు.

బ్యాంకుల్లో భద్రత ఏర్పాట్ల పరిశీలన

వీణవంక, నవంబర్ 20: రాయపర్తిలో బ్యాంకు దోపిడీ ఘటన నేపథ్యంలో హుజూరాబాద్ పట్టణం, వీణవంక మండలం చల్లూరు, వీణవంక గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులను బుధవారం హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ సందర్శించారు. సెక్యూరిటీ, సీసీ కెమెరాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బ్యాంకు అధికారులకు అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్-100కు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ గౌడ్, జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, వీణవంక ఎస్ఐ తిరుపతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్ నేత కుటుంబానికి జీవీఆర్ పరామర్శ

మానకొండూర్ రూరల్, నవంబర్ 20: లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాపాక రమణయ్య బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. మంగళవారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కరీంనగర్‌లో ఓ ప్రయివేటు దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మళ్లీ నొప్పి రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమణయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ ఎడ్ల సుగుణాకర్, ఊటూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎడ్ల సతీశ్, నాయకులు పురం అనిల్ కుమార్, కొట్టె రఘు తదితరులు ఉన్నారు.

హక్కుల సాధన కోసం బ్రాహ్మణులు ఐక్యం కావాలి

తెలంగాణచౌక్, నవంబర్20: హక్కుల సాధన కోసం బ్రాహ్మణులు ఐక్యం కావాలని భారతీయ బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీరాంభట్ల దీపక్‌బాబు పిలుపునిచ్చారు. నగరంలోని సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వివిధ బ్రాహ్మణ సంఘాలు ఏకతాటిపైకి రావాలన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ పరిషత్‌కు అలాన పాలన లేకుండా పోయిందన్నారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందడం లేదని తెలిపారు. ధూపదీప నైవేద్య పథకాన్ని అన్ని గుడులకు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి 500 కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. కుల వృత్తి మీద ఆధారపడి జీవనోపాధి పొందుతున్న బ్రాహ్మణులకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇప్పించాలన్నారు. ప్రతి జిల్లాలో బ్రాహ్మణ భవనం నిర్మాణ కోసం స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

కొత్తపల్లి/ వీణవంక/కరీంనగర్ రూరల్/ తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 20 : జాతీయ 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణరావు అతిథులుగా హాజరయ్యారు. గ్రంథాలయంలో వారం పాటు విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి ఎ.సరిత, పాఠకులు ముదిగంటి సరిత, గౌతమి తదితరులు పాల్గొన్నారు. అలాగే వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ కె.రాజిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రామ్మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు. కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సమత, లైబ్రేరియన్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవాల ముగింపులో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, గ్రంథాలయ అధికారి శ్వేత, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణచౌక్, నవంబర్ 20: కేరళ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శబరి యాత్ర వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నదని డిపో-2 డీఎం మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరీంనగర్ డిపో-2కు చెందిన సూపర్‌లగ్జరీ, రాజధాని ఏసీ బస్సులను భక్తులు బుకింగ్ చేసుకునే సదుపాయం కల్పించామని తెలిపారు. ఆయా బస్సుల్లో 36 మంది ప్రయాణించవచ్చని, సూపర్ లగ్జరీకి కిలోమీటరుకు రూ 59, రాజధానికి 77 రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. టోల్ గేట్ రుసుం ఆర్టీసీ చెల్లిస్తుందని, బస్సును బుకింగ్ చేసుకున్న భక్త బృందంతోపాటు ఒక వంట మనిషి, ఇద్దరు మణికంఠస్వామి, ఒక సహాయకుడికి ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. రాష్ట్ర పరిధి దాటిన తర్వాత కర్ణాటక, తమిళనాడు సరిహద్దు పన్నులు బస్సు బుకింగ్ చేసుకున్న వారు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కేరళలో మాత్రం ఆ రాష్ట్రంతో ఆర్టీసీకి ఉన్న ఒప్పంద ప్రకారం ఎలాంటి ట్యాక్స్ చెల్లించనవరం లేదని తెలిపారు. భక్తులు పూర్తి వివరాల కోసం నేరుగా లేదా సెల్ 9959225921నంబరులో సంప్రదించాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం

గోపాల్‌రావుపేటలో ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

రామడుగు, నవంబర్20 : గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉదయం ప్రార్థన సమయంలో క్రమశిక్షణ, నైతిక విలువలపై విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. ఆరో తరగతిలో పాఠశాలకు చక్కగా హాజరవుతున్న విద్యార్థులతో పాటు ఎస్ఏ1లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ఆరో తరగతిలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పిండివంటకాలతో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ న్యాయ నిర్ణేతలను ఆకట్టుకున్నది. పిండి వంటకాల పోటీల్లో విద్యార్థులు మీనాక్షి, ప్రజ్యోత్, పవార్ ఇందు ప్రోత్సాహకాలు అందుకున్నారు. కార్యక్రమాల్లో పాఠశాల హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు వనిత, జలపతిరెడ్డి, వీర్‌పాల్ రెడ్డి, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తిమ్మాపూర్: ఎస్ఎస్ఆర్ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ శ్రీకాంత్

తిమ్మాపూర్, నవంబర్ 20: మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ పాఠశాలలో తిమ్మాపూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల బారిన పడితే జీవితం చిత్తవుతుందన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్లు బర్మయ్య, జితేందర్, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 20: పట్టణంలోని న్యూ శాతవాహన హైస్కూల్‌లో బుధవారం 'మత్తు పదార్థాలు-అనర్థాలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హుజూరాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తుపైనే దృష్టి పెట్టాలని, మత్తుకు నో చెప్పాలని సూచించారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు వాడుతున్నట్లు దృష్టికి వస్తే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వకుళాభరణం వెంకటేశ్వర్లు, పరాంకుశం కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.

NT-338964-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

కార్పొరేషన్, నవంబర్ 20: బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్, ఆలిండియా ట్రూ క్రిస్టియన్స్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు జయశాలి సుందరరావు 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని కట్టరాంపూర్‌లోని నిరాశ్రయుల ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఏఐటీసీసీ జిల్లా అధ్యక్షుడు ప్యాట యాదిప్రకాశ్, సీబీటీ కరీంనగర్ ప్రిన్సిపాల్ ఎస్.గిద్యోను, వైస్ ప్రిన్సిపాల్ కె.డేవిడ్, అబ్రహం, సోలోమోను, ప్రభాకర్, అశోక్, రవి, సరోజన, పద్మ, స్వప్న పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

హుజూరాబాద్ టౌన్, నవంబర్20: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి బోర్నపల్లిలో బుధవారం ప్రమాదవశాత్తు వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నక్క సరోజన (58) ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలించగా, బోర్నపల్లి చెరువులో శవమై కనిపించింది. సరోజన కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

రాంనగర్, నవంబర్ 20: ఇటీవల అగ్ని ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామానికి చెందిన దుర్గం కొమరమ్మ(56) ఈనెల 12న వేడి నీళ్లు పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. వారంరోజులు చికిత్స పొందిన కొమరమ్మ బుధవారం మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

ఆరు గ్యారెంటీలతో ప్రయోజనం లేదు

వీణవంక, నవంబర్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని, ధర్మసమాజ్ పార్టీ డిమాండ్ చేస్తున్న ఐదు గ్యారెంటీలు అమలు చేయాలని డీఎస్పీ మండలాధ్యక్షుడు సదానందం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, నాణ్యమైన వైద్యం, ప్రజలందరికీ ఉపాధి అవకాశాలు, అర్హులైన వారందరికీ ఎకరా భూమి, 200 గజాలతో నాలుగు గదుల ఇల్లు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, రవికిరణ్, అనిల్, వినయ్, తిలక్, లక్ష్మణ్, పృథ్వీరాజ్, కిశోర్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

22 నుంచి సార్వత్రిక విశ్వవిద్యాలయం తరగతులు

తెలంగాణచౌక్, నవంబర్ 20: ఈనెల 22 నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం డిగ్రీ ప్రథమ సంవత్సరం 2వ సెమిస్టర్, బీఎస్సీ సైన్స్ ప్రయోగ తరగతులు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ప్రాంతీయ సమన్వయ కేంద్రం అధికారి డాక్టర్ వంగల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి 26 వరకు గణిత శాస్త్రం, జంతుశాస్త్రం, భౌతిక శాస్త్రం, వృక్షశాస్త్రం తరగతులు, 27 నుంచి 30 తేదీ వరక